చేపల మార్కెట్‌పై ఆకస్మిక దాడులు

ప్రజాశక్తి-విజయనగరం

నగరంలోని పలు కూడళ్లలో చికెన్, మటన్, చేపల వ్యాపారులపై లీగల్ మెట్రాలజీ అధికారులు ఆదివారం ఆకస్మిక దాడులు చేపట్టారు. చట్టవిరుద్ధమైన తూనిక రాళ్లు వినియోగించి వినియోగదారులను మోసగిస్తున్న ఐదుగురు చేపల వర్తకులపై కేసులు నమోదు చేశారు. ఇంకోసారి ఇటువంటి మోసాలు చేస్తే భారీగా అపరాధ విధిస్తామని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తూకంలో, కొలతల్లో ఎక్కడైనా మోసాలు గుర్తిస్తే తమ శాఖకు తెలపవచ్చని ఇన్‌స్పెక్టర్ ఎం.దామోదర నాయుడు తెలిపారు.

తనిఖీలు చేస్తున్న ఇన్‌స్పెక్టర్ దామోదరనాయుడు

ఏచూరి లేని రాజకీయాలను ఊహించలేం

దేశ, విదేశాలతో స్నేహపూర్వక సంబంధాలు

క్లిష్టమైన పరిస్థితుల్లో రాజకీయ చతురత

నమ్మిన సిద్ధాంతం కోసం జీవితమే త్యాగం

సంస్మరణ సభలో అశోక్ సహా పలువురి వక్తలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఇటీవల మరణించిన సిపిఎం జాతీయ ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి యావత్తు దేశానికి ఆదర్శనీయులని, ఆయన లేని దేశ రాజకీయాలను ఊహించలేమని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు సహా పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. దేశ రాజకీయాల్లో ఏచూరి కీలకపాత్ర పోషించారని కొనియాడారు. దేశ, విదేశాల్లోని వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అభ్యుదయ శక్తులు, లౌకికవాదులతో స్నేహపూర్వక సంబంధాలు కొనసాగించారని తెలిపారు. ఇటీవల ఏర్పడిన ఇండియా కూటమి సహా అనేక సందర్భాల్లో దేశంలోని వివిధ రాజకీయ పార్టీలను ఐక్యం చేసిన ఘనత కూడా ఆయనదేనని కితాబిచ్చారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సైద్ధాంతిక ఆలోచనలు జోడించి ముందుకు నడపడంలోనూ ఎంతో విజయవంతమయ్యారని కొనియాడారు. ఆదివారం విజయనగరంలోని జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ అధ్యక్షతన సీతారాం ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. అశోక్‌తోపాటు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు హాజరయ్యారు. తొలుత ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏచూరి ఆశయాలు సాధిస్తామంటూ నినాదాలు చేశారు. ఏచూరిపై వక్తల అభిప్రాయాలు...

సీతారాం ఏచూరి సంస్మరణ సభలో మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు

ఆదర్శనీయుడు సీతారాం ఏచూరి

సీతారాం ఏచూరి ధన్యజీవి. దేశమును ప్రేమించుమన్న.... మంచి అన్నది పెంచుమన్న... అన్న గురజాడ ఆశయం ఆయనలో ఎంతో స్పష్టంగా, లోతుగా కనిపిస్తుంది. ఏచూరితో కలిసి పార్లమెంట్‌లో పనిచేసిన అనుభవం ఉంది. ఎదుటి వ్యక్తి ఆలోచనలు, అభిప్రాయాలను అంగీకరించినా, అంగీకరించకున్నా.. గౌరవించే అలవాటు ఆయనకు ఉంది. నమ్మిన సిద్ధాంతం కోసం జీవితమంతా కట్టుబడి పనిచేశారు. సిపిఎం భాగస్వామిగా ఏర్పడిన యునైటెడ్ ఫ్రంట్‌లో ఆ పార్టీకి ప్రధాని పదవి వచ్చే అవకాశం దక్కినా, అందుకు తమ పార్టీ సిద్ధాంతం అంగీకరించబోదంటూ తృణపాయంగా తోసిపుచ్చడమే కాకుండా అందుకు గల కారణాలను ప్రజలకు, పార్టీకి వివరించిన వ్యక్తి ఏచూరి. పార్లమెంట్‌లో చురుకుగా పాల్గొంటూ దేశానికి ఉపయోగపడే ఎంతో చర్చ నడిపేవారు. కొన్ని సందర్భాల్లో ఆయన అభిప్రాయాలకు అంగీకారం దొరకనప్పుడు ప్రజాస్వామ్య పద్ధతులకు లోబడి పనిచేశారు. అంతే తప్ప ఇప్పటి నాయకుల మాదిరిగా దుర్భాషలాడడం ఆయన రాజకీయ చరిత్రలో లేదు. ఏచూరికి దేశభవిష్యత్తు పట్ల, రాజకీయాల పట్ల స్పష్టమైన అవగాహన ఉందన్న విషయం ఎవరైనా అంగీకరించక తప్పదు. ఆయన బాటలో నిలబడి పనిచేయడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి.

- పూసపాటి అశోక్ గజపతిరాజు, కేంద్ర మాజీ మంత్రి

అపారమైన మేధో సంపత్తి

ఏచూరి అత్యంత ధైర్య సాహసవంతమైన, అపారమైన మేధో సంపన్నమైన నాయకుడు. దేశం విచ్ఛిన్నకర ప్రయత్నాలు జరిగిన ప్రతిసారీ ప్రజాస్వామ్య విలువలకు లోబడి, తన తెలివితేటలు జోడించి అడ్డుకునేందుకు ప్రయత్నించారు. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన అనేక బిల్లులపై ప్రజాకోణంలో చర్చ జరిపి లోపాలను ఎత్తిచూపారు. రాష్ట్ర విభజన సమయంలోనూ ఎపికి నష్టం జరగకుండా ప్రత్యేక హోదా, ఇతర అంశాలపై జాతీయ స్థాయిలో గట్టిగా మాట్లాడింది ఏచూరియే. దేశ సమగ్రత కోసం నిరంతరం ఆయన పోరాడారు.

- బీశెట్టి బాబ్జీ, లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు

లౌకిక విలువల కోసం అలుపెరుగని పోరాటం

దేశ సమైక్యత, లౌకిక విలువలు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం సీతారాం ఏచూరి అలుపెరుగని పోరాటం చేశారు. యునైటెడ్ ఫ్రంట్, యుపిఎ -1 ప్రభుత్వంలోనూ ఏచూరి పాత్ర అత్యంత కీలకంగా ఉండేది. యుపిఎ-1 ప్రభుత్వంలో కనీస ఉమ్మడి కార్యక్రమం రూపకర్త కూడా ఆయనే. ఫలితంగా సమాచార హక్కుచట్టం, ఉపాధి హామీ చట్టం, అటవీ గిరిజన హక్కుల చట్టం, ఆహార భద్రతా చట్టం సహా అనేక చట్టాలు, సంక్షేమ పథకాలు అమల్లోకి వచ్చాయి. ఎమర్జెన్సీ సమయంలో ఇందిరాగాంధీని సైతం ఢిల్లీ జెఎన్‌యు ఛాన్సలర్ పదవి నుంచి రాజీనామా చేయించి చరిత్ర సృష్టించారు.

- ఒమ్మి రమణ, సిపిఐ జిల్లా కార్యదర్శి

సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు, వామపక్ష, కాంగ్రెస్, ఆమ్‌ఆద్మీ, లోక్‌సత్తా నాయకులు

గొప్ప నాయకుడిని కోల్పోయాం

ఏచూరి గొప్ప నాయకుడు. పార్టీ ఏదైనా ప్రజల కోసం పనిచేసే నాయకులు, వ్యక్తులు సమాజానికి అవసరం. అటువంటి కోవకు చెందిన వారే ఏచూరి. అందులోనూ తెలుగు వ్యక్తి కావడం పలు సందర్భాల్లో గర్వంగా ఉండేది. ఆయన లేని లోటు తీరనిది.

- పి.అదితి గజపతిరాజు, విజయనగరం ఎమ్మెల్యే

ఏచూరి మరణం తీరనిలోటు

ఓ వైపు లౌకికవాద శక్తులపై దాడులు, మరోవైపు మతోన్మాదం పెచ్చురిల్లుతున్న తరుణంలో నిరంతరం దేశ సమగ్రత కోసం పోరాడే సీతారాం ఏచూరి మరణం తీరనిలోటు. కేవలం దేశంలో స్వేచ్ఛ, సమానత్వం కోసమే కాకుండా ప్రపంచ దేశాలను ఐక్యం చేసేందుకు పరితపించే ఏచూరి ఎన్నో సవాళ్లను అధిగమించి రాజకీయాలను ముందుకు నడిపించారు. ప్రజాతంత్ర ఉద్యమాలకు ఊపిరి పోశారు.

- బెహరా శంకరరావు, సిపిఐ ఎంఎల్ నాయకులు

ఏచూరి అసాధారణమైన నేత

సీతారాం ఏచూరి అసాధారణమైన నాయకుడు. పార్టీ ఉద్యమంలో భాగంగా ఆయనతో నాకు అనుబంధం ఉంది. కేంద్రం నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇన్‌ఛార్జిగా ఉండేవారు. జాతీయ మహాసభల్లోనూ చాలాసార్లు నేను పాల్గొన్నాను. మా పార్టీ అంతర్గత సమావేశాల్లో గానీ, వివిధ పార్టీలు అనుసరిస్తున్న రాజకీయ విధానాల పట్ల గానీ ఆయనకు ఎంతో స్పష్టమైన అవగాహన ఉండేది. అందువల్ల మహాసభల్లో సైతం మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తమ పార్టీ రాజకీయ విధానాన్ని ప్రవేశపెట్టే అవకాశం ఆయనకే దక్కేది. తప్పక ఆమోదం లభించేది. దాన్ని తిరిగి ఆయనే ప్రతినిధులకు వివరించేవారు. అంతగొప్ప అరుదైన వ్యక్తిత్వం, మేధోశక్తి, సామర్థ్యాలు ఉన్న నాయకుడు. ఆయన కేవలం దేశ రాజకీయాలకే పరిమితం కాలేదు. ఎన్నో దేశాల్లో నెలకొన్న రాజకీయ, ఆర్థిక, సామాజిక సమస్యలకు పరిష్కారం చూపారు.

- ఎం.కృష్ణమూర్తి, సిపిఎం సీనియర్ నాయకులు

కార్మిక ఉద్యమానికి తీరని లోటు

ఏచూరి మరణం కార్మిక ఉద్యమానికి, లౌకిక శక్తులు, అభ్యుదయవాదులకు తీరని లోటు. ప్రజాస్వామ్యానికి ముప్పు వాటిల్లినప్పుడు, మతోన్మాదం పెచ్చుమీరుతున్న ప్రతిసారీ ఏచూరి తనదైన శైలిలో తిప్పికొట్టేవారు. ఆయన తల్లిదండ్రులు డాక్టరో, ఐఎఎస్ ఆఫీసరో చేయాలని కలలు కన్నప్పటికీ, ఆ పరిమితులకు మించిన సేవలందించాలనే లక్ష్యంతో రాజకీయాల్లోకి వచ్చారు. విద్యార్థి దశలో ఎత్తిన ఎర్రజెండా తుదిశ్వాస విడిచేవరకు దించకుండా పనిచేస్తూ ఎంతోమంది నాయకులు, కార్యకర్తలు, అభ్యుదయవాదులకు ఆదర్శంగా నిలిచారు.

- తమ్మినేని సూర్యనారాయణ, సిపిఎం జిల్లా కార్యదర్శి

అభిప్రాయాల్ని విభేదించినా... వ్యక్తుల్ని గౌరవించారు

ఏచూరి సిద్ధాంత పరంగా వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకుల అభిప్రాయాల పట్ల విభేదాలు వ్యక్తం చేసినప్పటికీ, ఆ నాయకుల పట్ల ఎల్లప్పుడూ గౌరవంగానే మెలిగేవారు. అందువల్లే ఎన్నో సందర్భాల్లో పలు పార్టీలను ఐక్యం చేసి ప్రజావ్యతిరేక నిర్ణయాలు, చట్టాలపై పార్లమెంట్‌లో గళం విప్పారు. ఈ రకంగా ఏచూరి నాకు నచ్చిన లీడర్. ఎదుటి మనిషి లేదా పార్టీని నొప్పించకుండా నిస్సంకోచంగా నిలదీసే శక్తి సామర్థ్యాలు ఏచూరికే చెల్లిందనడంలో సందేహం లేదు.

- ఎం.విద్యాసాగర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు

మడమ తిప్పని నాయకుడు ఏచూరి

దేశ ప్రయోజనాలు కాపాడే క్రమంలో ఎన్నో ఒత్తిళ్లు, బెదిరింపులు వచ్చినా ఏచూరి వెరవలేదు. నమ్మిన సిద్ధాంతం అమలుకు, దేశ ప్రజల సేవకు అంకితమై పనిచేశారు. ప్రజా సమస్యల పరిష్కారం పట్ల ఆయనకు ఉన్న చిత్తశుద్ధి, మారుతున్న పరిస్థితులను అంచనా వేయడంలో ఆయనకు ఉన్న అవగాహన, సమాజం పట్ల ఆయనకు ఉన్న స్పష్టత ఎనలేనివి. దీనికితోడు నిరంతర అధ్యయనంతో ముందుకు సాగారు. ప్రజాశ్రేయస్సే ఏకైక అజెండాగా ముందుకు సాగిన, సాగించిన ఏచూరి ప్రయాణాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది.

- కిమిడి నాగార్జున, టిడిపి జిల్లా అధ్యక్షులు

పోరాట యోధుడు ఏచూరి

ఏచూరి గొప్ప పోరాట యోధుడు. సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శిగా కేవలం ఈ పార్టీని ముందుకు నడిపించడానికే పరిమితం కాలేదు. మారుతున్న దోపిడీ విధానాలను ఎప్పటికప్పుడు అంచనాలు వేసి, వాటిపై పోరాటానికి ఇతర పార్టీలను కూడా ఐక్యం చేసిన గొప్ప నాయకుడు. రాజకీయ శత్రువులను ఎంత సూటిగా ప్రశ్నించేవారో? అందులో అంతే సున్నితత్వం కనిపించేది. అందుకే ఏచూరికి దేశ, విదేశాలకు చెందిన ఎన్నో పార్టీల ప్రతినిధులు , అభ్యుదయవాదులు నివాళులర్పించి, విచారం వ్యక్తం చేశారు. ఇంతటి మేధావి అయినా నిత్యం నిగర్వంగా కనిపించేవారు. చివరికి ఆయన శరీరాన్ని కూడా ఎయిమ్స్‌లో మెడికల్ విద్యార్థుల ప్రయోగాలకు అప్పగించడం ఆయన ఆశయాలకు తార్కాణం.

- దయానంద్, ఆమ్ ఆద్మీ రాష్ట్ర అధికార ప్రతినిధి

పెదతాడివాడలో సిరిమాను చెట్టు గుర్తింపు

సిరిమాను చెట్టుకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

ప్రజాశక్తి-డెంకాడ

పైడితల్లమ్మ సిరిమానోత్సవానికి మండలంలోని పెదతాడివాడ గ్రామంలో మజ్జి అప్పారావు కళ్లంలో ఉన్న చెట్టును సినిమాను కోసం గుర్తించారు. ఆదివారం ఆ చెట్టుకు సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు బొట్టు పెట్టి పూజలు నిర్వహించి మొదట ఘట్టాన్ని ప్రారంభించారు. నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి పూజలు చేసి, మొక్కలు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా పూజారి వెంకటరావు మాట్లాడుతూ సినిమాను చెట్టుకు వారం రోజుల పాటు పూజలు చేసి, 28న ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో చెట్టును కొట్టి విజయనగరం తరలిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పైడితల్లమ్మ దేవస్థానం ఎసి డివివి ప్రసాదరావు, మాన్సాస్ ట్రస్ట్ డిప్యూటీ కమిషనర్ కెఎన్‌డివి ప్రసాద్, పెదతాడివాడ నాయకులు చింతపల్లి రామ్మూర్తి, గాదిపల్లి రామ్మూర్తి, రామకృష్ణరాజు, చిరంజీవి రాజు, పడాల చిన్నారావు, ఎంపిటిసి జి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా విద్యుత్తు ఉద్యోగుల మహాజనసభ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

దాసన్నపేటలోని విద్యుత్తు ఉద్యోగుల సంఘం-1104 కార్యాలయంలో శ్రీ వెంకటేశ్వర విద్యుత్తు ఎంప్లాయీస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మహాజనసభ ఉత్సాహంగాసాగింది. సొసైటీ అధ్యక్షులు పతివాడ రామునాయుడు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సంఘ సభ్యుల పిల్లల్లో అత్యధిక మార్కుల సాధించిన వారికి ప్రోత్సాహకాలు అందించారు. విద్యుత్ భవన్‌లో పనిచేస్తున్న జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ కంటుభుక్త నాగరాజు కుమారుడు కృష్ణవంశీ పుంగనూరులో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా నియమితులు కావడంతో ఆయన్ను సన్మానించారు. ఈ సంవత్సర కాలంలో ఉద్యోగ విరమణ పొందిన సంఘ సభ్యులను సత్కరించారు. విద్యుత్తు శాఖ జాతీయ స్థాయి క్రీడలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని కూడా సత్కరించారు. సభలో ఎస్ఇ ఎం.లక్ష్మణరావు మాట్లాడుతూ విజయనగరం జిల్లా విద్యుత్ ఉద్యోగుల కో-ఆపరేటివ్ సొసైటీ రాష్ట్రంలో ఉన్న అన్ని సొసైటీలకు మార్గదర్శకంగా ఉందని ప్రశంసించారు. ఇఇలు పూడి హరి, జి.సురేష్ బాబు, సొసైటీ పూర్వ అధ్యక్షులు డిఆర్ఎస్ వరప్రసాద్, డి.రాజేంద్ర ప్రసాద్ పాల్గొని ప్రసంగించారు. ఎపిఇఇ యూనియన్ (1104) విజయనగరం సర్కిల్ కార్యదర్శి సురగాల లక్ష్మణ మాట్లాడుతూ బ్యాంకుల కంటే అతి తక్కువ వడ్డీకి సొసైటీ రుణ సదుపాయం కల్పించి, విద్యుత్ ఉద్యోగుల కుటుంబాలను ఆదుకుంటోందని చెప్పారు. సొసైటీ కార్యదర్శి బెహరా కూర్మారావు వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షులు గనివాడ అప్పలనాయుడు, డైరెక్టర్లు సారిక మురళి, ఎన్.పైడి రాజు, ఎన్.రమణ, జి.అప్పలసూరి, కె.రాజశేఖర్, సంయుక్త కార్యదర్శి అరసాడ రవి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణవంశీని సత్కరిస్తున్న ఎస్ఇ లక్ష్మణరావు, సొసైటీ సభ్యులు

ప్రాణాలకు రెడ్‌క్రాస్ భరోసా

- విపత్తుల నిర్వహణలో ముందంజ
- కేన్సర్‌పై అవగాహన కార్యక్రమాలు
- కార్నియాల సేకరణతో ఎంతోమంది జీవితాల్లో వెలుగులు
- 'ప్రజాశక్తి'తో రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్ కెఆర్‌డి ప్రసాదరావు ముఖాముఖి

'ప్రతి మనిషీ జీవించడానికి గాలి, నీరు, నిప్పు, ఆకాశం, భూమి ఎంతో అవసరం. మనిషి జీవితంలో రక్తం కూడా అంతే అవసరం. మనిషి ఆపత్కాల, విపత్కర పరిస్థితుల్లో రక్తం ప్రాణాలను నిలబెడుతుంది. అటువంటి రక్తాన్ని సేకరించి, భద్రపరచడం ద్వారా వేరొకరి ప్రాణాన్ని కాపాడటానికి ముందుండేది రెడ్‌క్రాస్' అన్నారు ఆ సంస్థ జిల్లా ఛైర్మన్ కె.ఆర్.డి ప్రసాదరావు. ప్రాంతంతో సంబంధం లేకుండా ప్రపంచ వ్యాప్తంగా రెడ్‌క్రాస్ సేవలందిస్తోందని చెప్పారు. మనిషి ప్రాణాలు కాపాడడానికి రక్తం ఎంతో అవసరమని, అటువంటి రక్తాన్ని ఇవ్వడానికి దాతలు అధిక సంఖ్యలో ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆయన ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...

- ప్రజాశక్తి, విజయనగరం కోట

రెడ్ క్రాస్ సంస్థ లక్ష్యం ఏమిటి.?

రెడ్‌క్రాస్ సంస్థ ప్రధాన లక్ష్యం రక్తాన్ని సేకరించి దాతలకు అందించడం. దీంతోపాటు ఫస్ట్‌ఎయిడ్, పరిసరాల పరిశుభ్రత, వాటర్ పవర్ కన్జర్వేషన్, విపత్తుల నిర్వహణపై అవగాహన కల్పించడం. ఇవే కాకుండా జిల్లా పరిస్థితులను అనుసరించి పలు కార్యక్రమాలు చేపడుతుంది. ప్రధానమంత్రి భారత జన ఔషధ మందుల నిర్వహణతోపాటు పట్టణ ప్రాంతాల్లో ఇల్లు లేని వారికి షెల్టర్ కల్పించడంతోపాటుగా భోజన సదుపాయాలు కల్పిస్తుంది ప్రస్తుతం పట్టణ కేంద్రంలో 30 నుంచి 35 మందికి వసతి కల్పిస్తున్నాం.

రెడ్‌క్రాస్ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు ఏమిటి.?

రెడ్‌క్రాస్ ద్వారా రక్తసేకరణ, భద్రపరిచి రోగులకు సరఫరా చేయడం ప్రధానం. అందుకోసం రక్తదాన శిబిరాలు ఏర్పాటుచేయడం, యువతకు రక్తదానం ఆవశ్యకతపై అవగాహన కల్పించడం చేస్తున్నాం. వీరికి రక్తం అవసరం ఏమిటి? ఏ వయసు వారు ఇవ్వాలి? ఎన్ని నెలలకు ఒకసారి రక్తం ఇవ్వాలి? అనే అంశాలపై అవగాహన కల్పిస్తున్నాం. డెడ్‌బాడీ ఫ్రీజర్ బాక్సులు రెండింటినీ అందుబాటులో ఉంచాం. నగరంలోని కొత్తపేట స్వర్గధామంలో ఒకటి, చీపురుపల్లిలో మరొకటి అందుబాటులో ఉన్నాయి.

ఏడాదికి ఎన్ని యూనిట్ల రక్తం సేకరిస్తున్నారు.?

రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా కోవిడ్‌కి ముందు ఏడాదికి 6 వేల యూనిట్లు రక్తం సేకరించేవాళ్లం. ప్రస్తుతం ఏడాదికి 1500 నుంచి 2 వేల యూనిట్లు మాత్రమే సేకరిస్తున్నాం. కోవిడ్ మహమ్మారి నుంచి బయట పడిన తర్వాత ప్రయివేటు రక్తనిల్వ కేంద్రాలు ఎక్కువయ్యాయి. అందుకే రెడ్‌క్రాస్ ద్వారా రక్త సేకరణ తక్కువైంది. రెడ్‌క్రాస్ సంస్థ రక్తాన్ని ఎటువంటి ప్రతిఫలమూ ఆశించకుండా కనీస ఛార్జీలతోనే అందిస్తుంది.



ఎంతమంది నుంచి కార్నియాలు సేకరించారు.?

2022 డిసెంబర్ నుంచి కార్నియా సేకరణ కేంద్రాన్ని ప్రారంభించాం. ఇప్పటివరకు 35 జతల కార్నియాలను సేకరించాం. వాటిని విశాఖలోని ఎల్‌వి ప్రసాద్ కంటి ఆసుపత్రికి పంపించాం. ఇతరులకు అమర్చే ముందు సరిపోల్చి వినియోగిస్తారు. వీటిలో కొన్ని పనికి రాకుంటే, పరిశోధనకు వాడుతారు. సెప్టెంబర్ నుంచి జిల్లా అంధత్వ నివారణ సొసైటీతో కలిసి పనిచేస్తూ ఈ నెలలోనే 11 జతల కార్నియాలను సేకరించాం.

> "రెడ్‌క్రాస్ సంస్థలో ప్యాకెట్ రక్తం కోసం రూ.1050 తీసుకుంటే, ప్రయివేట్ సంస్థల్లో రూ.1450 వసూలు చేస్తున్నారు. రెడ్‌క్రాస్ సంస్థలో దాతలు రక్తం నేరుగా ఇస్తే రూ.200 తగ్గించి, రక్తం అందించేవాళ్లం. ఇప్పుడు రక్తం ఇవ్వకపోయినా ఆ రూ.200 కూడా తగ్గించి అందిస్తున్నాం. అదే ప్రయివేట్ సంస్థలైతే రూ.1450తోపాటు మరొకరి నుంచి రక్తం తీసుకుంటున్నాయి. అత్యవసర సమయంలో ఎవరికైనా రక్తం అవసరమైతే 08922-272700ను సంప్రదించాలి. 24/7 అందుబాటులో ఉంటుంది."

మహిళల కోసం ప్రత్యేకంగా చేపడుతున్న కార్యక్రమాలు ఏమిటి.?

2022 డిసెంబర్‌లో మహిళా ఆరోగ్య కార్యక్రమం చేపట్టాం. దీని ముఖ్య ఉద్దేశం మహిళల్లో కేన్సర్‌పై అవగాహన కల్పించి, సకాలంలో వ్యాధిని గుర్తించి, వెంటనే తగు చికిత్స అందించడం. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా అనేక అవగాహన సదస్సులు నిర్వహించి, 23 మంది మహిళలను ఎంపిక చేసి, స్క్రీనింగ్ టెస్ట్‌లు చేయించాం. వారిలో 9 మందికి కేన్సర్ నిర్ధారణ అయింది. వీరు వివిధ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందుతున్నారు.

రెడ్‌క్రాస్ సంస్థ నిర్వహణ ఎలా.?

రెడ్‌క్రాస్ సంస్థకు ప్రభుత్వం నుంచి ఎటువంటి నిధులూ ఉండవు. కేవలం దాతల సహకారాలతోనే నడుస్తోంది. ప్రస్తుతం హోల్ బ్లడ్ వినియోగం తగ్గి, ప్లేట్‌లెట్లు, ఫ్యాట్ సెల్స్ వినియోగం పెరగడంతో రక్త సేకరణ తగ్గింది. దీన్ని అధిగమించడం కోసం పవర్ క్రెడిట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో రూ.65 లక్షలు విలువైన సామగ్రి ఏర్పాటుచేశాం. నెల రోజుల్లో ప్రజలకు అందుబాటులో రానుంది. దీనికి సంబంధించి చీపురుపల్లి ఏరియా ఆసుపత్రి ప్రాంగణంలో అరబిందో ఫార్మా సహకారంతో రూ.90 లక్షలతో బ్లడ్ బ్యాంక్, ఇతర సామగ్రి సమకూర్చాం.

ఆమె నేత్రాలు సజీవం

ప్రజాశక్తి-విజయనగరంకోట

గరివిడి మండలం తొండ్రంకి గ్రామానికి చెందిన టి.సూరమ్మ జిల్లా కేంద్రాస్పత్రిలో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న రెడ్‌క్రాస్ సభ్యులు ఆమె కుటుంబ సభ్యులతో మాట్లాడి, నేత్రదానానికి ఒప్పించారు. దీంతో ఆప్తాలమిస్టు బి.తారకేశ్వరరావు, డాక్టర్ రమ్య.. ఆమె కార్నియాలను సేకరించారు. వాటిని భద్రపరచడానికి ఐ-సెంటర్‌కి తరలించారు. నేత్రదానానికి అంగీకరించిన సూరమ్మ కుటుంబ సభ్యులను రెడ్‌క్రాస్ సంస్థ ఛైర్మన్ కె.ఆర్.డి ప్రసాద్, కార్యదర్శి కె.సత్యం అభినందించారు.

యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్

యూనియన్ బ్యాంకు రీజినల్ కార్యాలయం ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టారు. బ్యాంకు అధికారులు, సిబ్బంది పెద్ద చెరువు చుట్టుపక్కల ఉన్న చెత్తని ఊడ్చి, పిచ్చి మొక్కలను, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. తొలుత మయూరి జంక్షన్ నుంచి సిఎంఆర్ షాపింగ్ మాల్ వరకూ వాకథన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు రీజనల్ మేనేజర్ నరేష్, డిప్యూటీ రీజినల్ మేనేజర్ హరిప్రసాద్, శ్రీనివాసు, సీనియర్ మేనేజర్ మల్లేశ్వరరావు, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మారేడుమిల్లి జలపాతంలో బొబ్బిలి విద్యార్థిని గల్లంతు

ప్రజాశక్తి-బొబ్బిలి

అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి సమీపంలో ఉన్న జల తరంగిణి జలపాతంలో ఆదివారం బొబ్బిలి పట్టణంలోని రావువారివీధికి చెందిన కోసిరెడ్డి సౌమ్య గల్లంతైంది. కోసిరెడ్డి అప్పలనాయుడు కుమార్తె సౌమ్య ఏలూరు మెడికల్ కళాశాలలో మెడిసిన్ రెండో సంవత్సరం చదువుతోంది. తోటి విద్యార్థులతో కలిసి సౌమ్య విహారయాత్రకు వెళ్లింది. జలపాతంలో గల్లంతైన ముగ్గురిలో సౌమ్య ఉండడంతో పట్టణంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సౌమ్య గల్లంతు విషయం తెలియడంతో కుటుంబ సభ్యులు, బంధువులు విలపిస్తున్నారు.

26న రామాయణం రీసెర్చ్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఈ నెల 26న రామనారాయణంలో రామాయణం రీసెర్చ్ సెంటర్‌ను మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రారంభిస్తున్నట్లు ఎన్‌సిఎస్ ట్రస్ట్ ఛైర్మన్ నారాయణం శ్రీనివాస్ వెల్లడించారు. ఆదివారం స్థానిక ట్రస్టు కార్యాలయంలో రీసెర్చ్ సెంటర్ ఆహ్వాన ప్రతులను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామానారాయణం ప్రాంగణంలో ఈ నెల 26 నుండి 29 వరకు రామాయణ శంఖారావం నిర్వహించనున్నామన్నారు. రీసెర్చ్ సెంటర్ ప్రారంభోత్సవానికి కేంద్ర మాజీమంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు, మాజీ ఎమ్‌పి టిజి వెంకటేష్, తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ జిఎస్ఆర్ కృష్ణమూర్తి, మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు హాజరవుతారని వివరించారు.. 29న ముగింపు వేడుకల్లో ద్విసహస్రావధాని మాడుగుల నాగఫణిశర్మ, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, కొండపల్లి శ్రీనివాస్, సినీనటుడు సాయికుమార్ తదితరులు పాల్గొంటారని చెప్పారు. సమావేశంలో నీరజవల్లి, తవాస్మి అకాడవీ కి చెందిన ఆర్.శ్రీరామ చక్రధర్, శారదా దీప్తి, జాహ్నవి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వాన ప్రతులను విడుదల చేస్తున్న ఎన్‌సిఎస్ ట్రస్టు ఛైర్మన్ శ్రీనివాస్, సభ్యులు

కుళాయి కనెక్షన్లకు సచివాలయాల్లో దరఖాస్తులు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

నగర పరిధిలో కుళాయి కనెక్షన్ల కోసం సచివాలయాల ద్వారా గాని, స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా గాని దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ పల్లి నల్లనయ్య ఒక ప్రకటనలో తెలిపారు. రూ.200, రూ.6 వేలు కుళాయి కనెక్షన్లు మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వెంటనే సిబ్బంది కుళాయి ఏర్పాటు చేసేందుకు అవసరమైన సామగ్రి వివరాలను అంచనా వేసి తెలియజేస్తారని చెప్పారు. వాటిని చెల్లించిన వెంటనే కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇందుకోసం దరఖాస్తుదారుడు ఆస్తి పన్ను పూర్తిగా చెల్లించి ఉండాలని స్పష్టంచేశారు.

విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి

నెల్లిమర్ల: విద్యార్థులకు ఉద్యోగావకాశాలు పెరగాలంటే వారిలో పోటీతత్వం అలవడాలని సెంచూరియన్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి పిలుపునిచ్చారు. ఆదివారం విశ్వవిద్యాలయంలో తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ పరిశ్రమల్లో విద్యార్థులు ఎంపిక కావాలంటే వారిలో సామర్థ్యాలు, నైపుణ్యాలు పెరగాలన్నారు. అందుకు అనుగుణంగా ఇక్కడ విద్యార్థులకు బూట్ క్యాంప్‌లు, హెక్తాన్లతో పాటు వారికి అవసరమైన శిక్షణలు ఇస్తున్నామని చెప్పారు. రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి మాట్లాడుతూ పిల్లల పట్ల తల్లిదండ్రులు మరింత శ్రద్ధవహించాలన్నారు. డీన్ డాక్టర్ సన్నీ డయోల్, డీన్ డాక్టర్ పుష్పలత, ఐక్యూఎసి హెచ్‌ఒడి ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు విశ్వవిద్యాలయంలో అమలు చేస్తున్న కోర్సులు, ప్రగతి గురించి వివరించారు. సమావేశంలో డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ఎస్ వర్మ, గ్రామ్ తరంగ్ సిఇఒ బాబుశంకర్, డీన్ విజయ్ బాబు, ప్రొఫెసర్ పిఎస్‌వి రమణారావు, డాక్టర్ దీపక్, అధ్యాపకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'జగన్ క్షమాపణలు చెప్పాలి'

శృంగవరపుకోట: వెంకటేశ్వర స్వామి భక్తులకు జగన్ క్షమాపణలు చెప్పాలని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి డిమాండ్ చేశారు. లక్కవరపుకోటలో గల తన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పరమ పవిత్రమైన తిరుపతిలో ఘోర అపచారానికి పాల్పడిన నీచులు ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భక్తుల మనోభావాలను దెబ్బతీశారని తిరుమల లడ్డు తయారికి కల్తీ నెయ్యిని వాడడం ఎంతో దుర్మార్గమని జగన్ వైసిపి నాయకులు కమీషన్ల కోసం కక్కుర్తి పడ్డి దీనికి ఒడిగట్టారని ఆరోపించారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు శ్రీనాథ్ పెదబాబు, జివిఎస్ నాయుడు, ఇందుకూరి శ్రీనురాజు తదితరులు పాల్గొన్నారు.

27న నైరెడ్‌లో ఇంటర్వ్యూలు

రాజాం: పట్టణ పరిధిలో గల జిఎంఆర్ నేరెడ్‌లో ఈ నెల 27వ తేదీన 19 నుంచి 40 ఏళ్లలోపు గల వారికీ ఉచిత శిక్షణ కోసం ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు నైరెడ్ నిర్వాహకులు తెలిపారు. పురుషులకు అకౌంటింగ్ టాలీ, ఎలక్ట్రికల్ వైరింగ్, జెంట్స్ టైలరింగ్ కోర్సులకు, మహిళలకు హోమ్ నర్సింగ్, టైలరింగ్, మగ్గం వర్క్, బ్యూటీ పార్లర్ కోర్సులకు 30 రోజులపాటు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఈ శిక్షణ కాలంలో ఉచిత శిక్షణ, ఉచిత భోజనం, ఉచిత వసతి సదుపాయం కల్పిస్తామన్నారు. ఆసక్తి కలవారు ఎస్ఎస్‌సి, ఆధార్, రేషన్‌కార్డ్ ఒరిజినల్‌తో హాజరు కావాలని తెలిపారు.

ఎస్ఐగా గణేష్ బాధ్యతలు స్వీకరణ

నెల్లిమర్ల: స్థానిక పోలీస్ స్టేషన్‌లో నూతన ఎస్ఐగా ఆదివారం బి. గణేష్ బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఎస్ఐగా పనిచేసిన డి రామ గణేష్ దిశ పోలీస్ స్టేషన్‌కు బదిలీ పై వెళ్ళగా, జిల్లా కేంద్రంలో డిసిఆర్‌బి ఎస్ఐగా పని చేసిన బి.గణేష్ నెల్లిమర్ల ఎస్ఐగా ఇక్కడకు వచ్చి విధుల్లో చేరారు.

విద్యుత్ సరఫరాపై గ్రామస్తుల నిరసన

నెల్లిమర్ల: మండలంలోని కొండగుంపాంలో విద్యుత్‌ను పునరుద్ధరించాలని టిడిపి, జనసేన నాయకులు పతివాడ గోవిందరావు, మొయిద లక్ష్మణరావు కోరారు. స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద గ్రామస్తులు ఆదివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శనివారం సాయంత్రం ఈదురు గాలకు విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడిందని, విద్యుత్ సరఫరా నిలిచిపోయి 24 గంటలు దాటినప్పటికీ పునరుద్ధరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికార్లు విద్యుత్ పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన డిఎస్‌పి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

జిల్లా డిఎస్‌పిగా బాధ్యతలు చేపట్టిన జి.శ్రీనివాసరావు ఆదివారం ఎమ్మెల్యే కోళ్ళ లలిత కుమారిని లక్కవరపుకోటలోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పనిచేయాలని డిఎస్‌పిని ఆమె కోరారు.

నిబంధనలను అతిక్రమిస్తే క్రమశిక్షణ చర్యలు

బొబ్బిలి: పార్టీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని జనసేన నియోజకవర్గ ఇంచార్జి గిరడ అప్పలస్వామి హెచ్చరించారు. స్థానిక జనసేన కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో కొంతమంది పార్టీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని, అటువంటి వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని చెప్పారు. కూటమి ఎమ్మెల్యే బేబినాయనతో చర్చించి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు పని చేస్తామన్నారు. జనసేన అధినేత, రాష్ట్ర డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు పి.మనోజ్ కుమార్, నాగు, ఎం.దనుంజయ్, జనసైనికులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పశువులమ్మ పండగ

ప్రజాశక్తి- వేపాడ

మండలంలో వేపాడ, వల్లంపూడి, వీలుపర్తి, ఆకుల సీతంపేట, సింగరాయి గ్రామాల్లో ఆదివారం పశువులమ్మ పండగను ఘనంగా నిర్వహించారు. ఏటా ఖరీఫ్ వరి నాట్లు పూర్తయిన తరువాత పశువుల కష్టాలు తొలగిపోయినట్లు, పశువులు సంతోషంగా ఉండాలని, పంటలు బాగా పండాలని ఆకాంక్షిస్తు రైతులు ఈ పశువుల పండగను నిర్వహిస్తారు. గ్రామస్తులందరూ పశువులమ్మ ఆలయం వద్దకు గ్రామంలో ఉన్న పశువులన్నింటిని ఒక చోటకు చేర్చి అమ్మవారిని పశువులు చుట్టూ మూడుసార్లు ప్రదర్శన జరిపి పశువులపై ముగ్గురాటను జల్లి పశువుల నుదుట పసుపు బొట్టు పెట్టి పశువులు వెన్నపై నూనె రాసి ముడుపులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, ఉత్సవ కమిటీ నాయకులు, యువత తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి- బొబ్బిలి

విజయవాడ వరద బాధితులకు అభ్యుదయ విద్యా సంస్థలు, సహాయ స్ఫూర్తి ఫౌండేషన్, అమ్మ సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడ సింగ్ నగర్, రాజరాజేశ్వరిపేటలో 300 కుటుంబాలకు నిత్యావసర సరుకులు, బట్టలు, 50మంది విద్యార్థులకు పుస్తకాలు, వృద్ధులకు మందులు పంపిణీ చేశారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం లంక గ్రామాన్ని సందర్శించి నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అభ్యుదయ విద్యాసంస్థలు, అభ్యుదయ ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ చింత శారద, సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సాయికుమార్, సాయిరేవంత్, అమ్మ సేవ ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, సాయి, సభ్యులు ఈశ్వరరావు, లక్ష్మణ్, శివ సూర్య, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకుంటాం

ప్రజాశక్తి- భోగాపురం

అగ్ని ప్రమాద బాధితులను ఆదుకుంటామని ఎమ్మెల్యే లోకం మాధవి అన్నారు. మండలంలోని దిబ్బలపాలెంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాద బాధితులను ఎమ్మెల్యే దంపతులు ఆదివారం పరామర్శించారు. ఈ ప్రమాదంలో పెంటిమాని సీతమ్మ, రాము దంపతుల ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ సందర్భంగా వారికి రూ.10వేలు నగదు, పదివేల రూపాయలు విలువైన నిత్యవసర సరుకులు ఎమ్మెల్యే అందించారు. రాబోయే రోజుల్లో వారికి ఇల్లు పట్టాలు, ఇంటి నిర్మాణం బిల్లు అందించి తగిన సహాయం చేస్తామని మాట ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మట్టా అయ్యప్ప రెడ్డి, చెల్లిబోయిన నర్సింగ్ రావు, మండల పార్టీ అధ్యక్షులు వందనాల రమణ, బొల్లు త్రినాథ్, దిబ్బల పాలెం, రెడ్డిక కంచెరు జనసేన నాయకులు నీలాపు ఈశ్వర్ రావు, శిరపు జయరాజ్, నీలాపు బంగారు రెడ్డి, బైరెడ్డి రామకృష్ణ టిడిపి జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

సిహెచ్‌సి నిర్మాణం పూర్తయ్యేదెప్పుడో?

- గదులు చాలక అందరికీ ఒకే చోట వైద్యం
- వరండాలోనూ వైద్య సేవలే
- వైద్యులకూ సరిపడా గదుల్లేక ఇబ్బందులు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక సామాజిక ఆసుపత్రి నిర్మాణం ప్రారంభమై సంవత్సరాల గడుస్తున్నా ఇంతవరకు పూర్తికాలేదు. ఆసుపత్రి అదనపు గదుల నిర్మాణం ప్రారంభమై 5 సంవత్సరాలు గడుస్తున్నా పనులను మాత్రం పూర్తి చేయలేదు. అప్పట్లో ప్రభుత్వం రూ.5 కోట్లతో నిర్మాణ పనులను ప్రారంభించింది. అయితే సకాలంలో నిధులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టరు కొంత కాలం పనులను నిలిపివేశారు. ప్రస్తుతం ఆసుపత్రి అదనపు గదుల నిర్మాణం 60శాతం పూర్తయింది. నిర్మాణం పూర్తికాకపోవడంతో వైద్య సిబ్బంది, రోగులు పడరాని పాట్లు పడుతున్నారు. ముఖ్యంగా వైద్యం కోసం వస్తున్న రోగులు ఇరుకు గదుల్లో ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది.

రోజుకు 200 నుంచి 300 వరకూ

నెల్లిమర్ల సామాజిక ఆసుపత్రికి ప్రతి రోజూ 200 నుంచి 300 వరకూ రోగులు వస్తున్నారు. వీరందరికీ ఆసుపత్రి వరండాలో రోగుల నమోదు (ఒపి) తనిఖీలకు పంపిస్తున్నారు. గదుల చాలక పోవడంతో ఆరుబయట చికిత్స పొందుతున్న పరిస్థితులు కూడా ఉన్నాయి. వరండాలోనే కొంత మందికి వైద్య సేవలందిస్తున్నారు. వైద్యులు కూడా సరిపడా గదులు లేకపోవడంతో అందరూ ఒకే చోట ఒక గదిలో ఉండి ఒపిని పరిశీలించి వైద్యం అందిస్తున్నారు.

ఒకే గదిలో కిక్కిరిసిన రోగులు

ఐదేళ్లవుతున్నా..నిర్మాణంలోనే..

ఐదేళ్ల క్రితం సిహెచ్‌సి భవనాన్ని కూల్చి నూతన భవన నిర్మాణం కోసం అప్పటి ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఇన్నేళ్లలో నిధులు సక్రమంగా విడుదల చేసి ఉంటే నిర్మాణం పూర్తయ్యేది. నిధులు సక్రమంగా రాకపోవడంతో చాలా కాలం కాంట్రాక్టర్ నిర్మాణ పనులను మధ్యలో నిలిపివేశారు. దీంతో ఈ ఐదేళ్లలో కేవలం 60 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు డెంగీ, మలేరియా వంటి వైరల్ జ్వరాలతో రోగులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గదులు చాలక వైద్యులు, సిబ్బంది, రోగులు ఇబ్బందులు పడుతున్నారు. పూర్తి స్థాయిలో వైద్య సిబ్బంది, మందులు ఉన్నప్పటికీ గదులు కొరత వల్ల వైద్య సిబ్బంది, రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

నిర్మాణం మధ్యలో నిలిచిపోయిన ఆస్పత్రి భవనం

వరండాలో ఉన్న రోగులు

నిర్మాణం పూర్తవ్వకుండానే పరికరాలు రాక

అదనపు భవనాల నిర్మాణ పనులు పూర్తయిన తరువాత రావాల్సిన బెడ్లు, చిన్న పిల్లల చికిత్స కోసం పరికరాలు ముందుగానే ఆస్పత్రికి చేరుకున్నాయి. అయితే వీటిని వినియోగించడానికి గదులు లేక ఒక దగ్గర పెట్టి వదిలేశారు. దీంతో కొత్తవైనప్పటికీ అవి మూలకు చేరుతున్నాయి. ఎక్సరే ప్లాంట్ ఉన్నా గది సౌకర్యం లేక వినియోగంలోకి రాలేదు. ఇప్పటికైనా సామాజిక ఆసుపత్రి అదనపు గదుల నిర్మాణం పూర్తిచేసి పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చి రోగులకు వైద్యం అందించాలని పలువురు కోరుతున్నారు.

కళలను ఆదరించాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

కళలను ఆదరించాలని ఎమ్మెల్యే బేబినాయన కోరారు. స్థానిక శ్రీకళాభారతి ఆడిటోరియంలో ఆదివారం సాయంత్రం యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆనందోబ్రహ్మను బేబినాయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలలను, కళాకారులను ఆదరించి ప్రోత్సహించాలని కోరారు. ఆనందో బ్రహ్మలో చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సినీ గీతాలకు చిన్నారులు చేసిన నృత్యం అలరించింది. కలలను ప్రోత్సహించేందుకే ఆనందో బ్రహ్మ నిర్వహిస్తున్నట్లు విజయ మోహన్ చెప్పారు.

సిబిఐ విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి- విజయనగరం

తిరుపతిలో లడ్డూ కల్తీపై సిబిఐ విచారణ చేపట్టాలని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ స్టేట్ సివిల్ రైట్స్ చైర్మన్ కరణం తిరుపతినాయుడు అన్నారు. స్థానిక మారుతీ హోటల్లో ఆదివారం ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ జిల్లా సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లా ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ డిస్ట్రిక్ట్ సివిల్ రైట్స్ చైర్మన్‌గా సారిపల్లి బాలానంద సురేష్ కుమార్‌ను సౌత్ ఇండియా చైర్మన్ షేఖ్ ఇబ్రహీం పటేల్ ఆదేశాల మేరకు నియమించారు. ఈ సమావేశంలో జిల్లా నూతన సివిల్ రైట్స్ చైర్మన్ ఎస్‌బి సురేష్‌కుమార్, బి.నాగరాజు, ఎం. ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపిడిఒ ఇష్టారాజ్యం!

- గ్రామాల్లో సమస్యలు పట్టించుకోని వైనం
- ప్రజాప్రతినిధులు వినతులిచ్చినా నిర్లక్ష్యం
- కార్యదర్శులపైనా వేధింపులు

ప్రజాశక్తి-వేపాడ

ఆయనో మండల స్థాయి అధికారి. మండలంలో ఉద్యోగులకు పెద్దదిక్కుగా నిలవాల్సిన ప్రభుత్వ ప్రతినిధి. ఎంతో బాధ్యతగా వ్యవహరించాల్సిన హోదా. అయితే, ఆయన వాటన్నింటినీ విస్మరించారు. గ్రామాల్లో సమస్యలను గాలికొదిలేశారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులంటే చిన్నచూపు. చులకనభావం. ఎవరు ఏ సమస్యపై వినతులిచ్చినా పట్టించుకున్న దాఖలాలు లేవు. తన మాట వినని కార్యదర్శులపై వేధింపులకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు కూడా ఉన్నాయి. రాజకీయాల్లో జోక్యం చేసుకుంటూ వివాదాలకు కేంద్రంగా మారారన్న విమర్శలు కూడా వస్తున్నాయి. ఇంతకీ ఏం జరిగిందంటే..?

వేపాడ మండల కేంద్రానికి ఆనుకుని ఉంది వల్లంపూడి గ్రామం. ఆ గ్రామంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లే సిసి రోడ్డుకు ఇరువైపులా కాలువల నుంచి వాడకనీరు పైకి వెళ్లే మార్గం లేదు. దీంతో మురుగునీరంతా రోడ్డుపైకి చేరుతోంది. వర్షాలు కురిస్తే రోడ్డంతా చెరువులా మారుతుంది. విద్యార్థులతోపాటు స్థానికులు అందులోనుంచే రాకపోకలు సాగించాల్సిన దుస్థితి. దుర్వాసనతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు గ్రామస్తులు ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ దృష్టికి తీసుకెళ్లారు. నేటికీ తీసుకున్న చర్యలు మాత్రం శూన్యం. ప్రస్తుతం మండలంలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమం నిర్వహిస్తున్నా అక్కడ మాత్రం అపారిశుధ్యం విళయతాండవం చేస్తోంది. మండలంలో అనేక గ్రామాల్లో ఇదే పరిస్థితి. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు ఎంపిడిఒ దృష్టికి తమ సమస్యలను గ్రామసభల్లో తీసుకెళ్తున్నా ఎక్కడా పరిష్కరించడం లేదని వారు వాపోతున్నారు. పంచాయతీ సర్పంచులు, ఎంపిటిసి సభ్యులను ఎంపిడిఒ చులకనభావంతో చూస్తున్నారని వారు వాపోతున్నారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు

తుప్పలు, డొంకలతో నిండిన బక్కునాయుడుపేట వద్దనున్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల ఆవరణను అభివృద్ధి చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు, సామాజిక కార్యకర్త రిక్కి అప్పారావు.. స్పందన కార్యక్రమంలో పూర్వ కలెక్టర్ నాగలక్ష్మికి విన్నవించారు. వెంటనే కలెక్టర్ స్పందించి గురుకులం ఆవరణను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒకు ఆదేశాలు జారీచేశారు. కలెక్టర్ ఆదేశాలను సైతం ఎంపిడిఒ బేఖాతరు చేశారు. చివరికి దాతల సాయంతో ఓ సామాజిక కార్యకర్త గురుకుల మైదానాన్ని అభివృద్ధి చేస్తే, ఆ నిధులను ఎంపిడిఒ కాజేయాలని చూశారని, అందులో భాగంగా చేయని పని చేసినట్లు అప్పట్లో ఆయన ఉన్నతాధికారులకు తప్పుడు నివేదిక సమర్పించినట్లు రుజువైంది. చేయని పనిని చేసినట్లు చూపించడంలో, ఉన్నతాధికారులను 'మేనేజ్' చేయడంలో ఎంపిడిఒ దిట్ట అనే ఆరోపణలు ఉన్నాయి. అందుకే ఆయన ఎన్ని తప్పులు చేసినా, కింది స్థాయి ఉద్యోగులను వేధింపులకు గురిచేస్తున్నా చూసీచూడనట్లు వదిలేశారు.

వల్లంపూడిలో రోడ్డుపైకి చేరిన మురుగునీరు

ఎందుకు వెనుకాడుతున్నారో?

మండలంలోని పంచాయతీ కార్యదర్శుల్లో తన మాట వినని వారిపై ఎంపిడిఒ వేధింపులకు దిగుతున్నారు. ఆయనకు అనుకూలంగా ఉన్న పంచాయతీ కార్యదర్శులను మాత్రం అందలమెక్కిస్తున్నారు. అనుకూలంగా లేని కార్యదర్శులకు సెలవులు మంజూరు చేయకపోవడం, మెమోలివ్వడం, గ్రామాల్లో కొంతమంది రాజకీయ నాయకుల మాటలు విని సెక్రటరీలను నిందించడం వంటివి చేస్తున్నారు. గతంలో కూడా వాట్సాప్‌లో ఓ కార్యదర్శికి మెమో పంపిస్తే, ఏ తప్పూ చేయని తనకు ఎందుకు మెమోలిస్తున్నారని ఆ సెక్రటరీ ప్రశ్నించారు. దీంతో వాట్సాప్‌లో దానిని ఎంపిడిఒ డిలీట్ చేయడం గమనార్హం. ఏదో ఒకసాకుతో వేధింపులకు గురవుతున్నా కార్యదర్శులు ఫిర్యాదుకు మాత్రం వెనుకడుగు వేస్తున్నారు. ఉన్నతాధికారులతో ఎంపిడిఒకు ఉన్న పరిచయాల రీత్యా ఆయనపై ఎలాగూ చర్యలు తీసుకోరన్న ఉద్దేశంతోనే వెనుకడుగు వేస్తున్నట్లు కార్యదర్శులు.. మీడియా, ప్రజాప్రతినిధుల వద్ద వాపోతున్నారు.

జిల్లా ఉన్నతాధికారులు స్పందించాలి

గ్రామాల్లో సమస్యలను సర్పంచులు, ఎంపిటిసిలు.. ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ దృష్టికి తీసుకెళ్తే పట్టించుకోవడం లేదు. చెప్పుడు మాటలు విని కింది స్థాయి ఉద్యోగులపై వేధింపులకు పాల్పడుతున్నారు. ప్రభుత్వ అధికారి రాజకీయాలకు అతీతంగా బాధ్యతా యుతంగా వ్యవహరించాలి. కానీ, ఎంపిడిఒ ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా వ్యవహరిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఆయనపై చర్యలు తీసుకోవాలి. లేకుంటే ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తాం.

- గొంప వెంకటరావు, టిడిపి వేపాడ మండల అధ్యక్షులు

ఎంపిడిఒ సహకారం అంతంత మాత్రమే

ఎంపిడిఒ పట్నాయక్ సహకారం అంతంత మాత్రంగానే ఉంటుంది. ఆయన దృష్టికి ఏ సమస్యను తీసుకెళ్లినా పరిష్కరించరు. పైగా కొర్రీలు వేస్తారు. ఆయన అభివృద్ధికి ఎటువంటి సహకారమూ అందించరు. పైగా ఈ విషయం చెప్పినా విసుక్కుంటారు.

- సిరికి రామలక్ష్మి, మాజీ సర్పంచ్ ఆతవ

జమిలి ఎన్నికలతో ప్రజాస్వామ్యానికి తూట్లు

సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

మాట్లాడుతున్న తమ్మినేని సూర్యనారాయణ

ప్రజాశక్తి- బొబ్బిలి

నియంతృత్వ పాలనకు, ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచేందుకే జమిలి ఎన్నికలు అమలకు కేంద్రంలో బిజెపి కుట్ర పన్నుతుందని విమర్శించారు. పట్టణంలోని ఆదివారం పట్టణ కార్యదర్శి పి.శంకరరావు అధ్యక్షతన సిపిఎం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ బిజెపి నియంతృత్వ పాలన కోసమే ఒకే దేశం, ఒకే ఎన్నిక నినాదాన్ని తెరపైకి తీసుకువచ్చిందన్నారు. జమిలి ఎన్నికలకు సిపిఎం వ్యతిరేకమన్నారు. దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు దోచి పెడుతున్నారని విమర్శించారు. ప్రజలపై భారాలు వేసి కార్పొరేట్ సంస్థలకు రాయితీలు ఇవ్వడంతో పాటు బ్యాంక్ రుణాలను మాఫీ చేసి దేశ సంపదను ధారాదత్తం చేస్తున్నారన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. గ్రోత్ సెంటర్‌లో కార్మికుల హక్కులను అమలు చేయడం లేదని విమర్శించారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులు, స్కీమ్ వర్కర్స్ సమస్యలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై భారాలు వేసి దోపిడీ చేస్తుందన్నారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసి రైతులకు గిట్టుబాటు ధరలు ఇవ్వడం లేదన్నారు. బిజెపి విధానాలకు, ప్రజలపై భారాలకు వ్యతిరేకంగా అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. సీతారాం ఏచూరి మరణం అంతర్జాతీయ రాజకీయాలకు, సిపిఎంకు తీవ్ర నష్టమని ఆవేదన వ్యక్తం చేశారు. నిరంతరం ప్రజా సమస్యలపై అధ్యయనం చేసి పోరాటం చేసిన మార్క్సిస్టు మేధావి సీతారాం ఏచూరి అని కొనియాడారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టివి రమణ మాట్లాడుతూ టిడిపి వంద రోజులు పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. గ్రోత్ సెంటర్లో పారిశ్రామిక అభివృద్ధి చేయాలని, మూతపడిన జ్యూట్, చక్కెర పరిశ్రమలను తెరిపించి నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్.గోపాలం, రామభద్రపురం, బాడంగి మండల కార్యదర్శులు బి.శ్రీనివాసరావు, సురేష్, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా యువకుడు మృతి

ప్రజాశక్తి- రాజాం

పట్టణ పరిధిలోని శ్రీకాకుళం రోడ్డులో అంతకాపల్లి గ్రామ సమీపంలోని మామిడి తోటలో ఆదివారం యువకుడు అనుమానస్పద స్థితిలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతుడు ఉద్దవోలు గ్రామానికి చెందిన మరడాన శివ (25)గా గుర్తించారు. తోటలో మృతదేహం పడి ఉండటం, పక్కనే పురుగుల మందు డబ్బా కనిపించడంతో ఇది హత్య, ఆత్మహత్య అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. చేతికందే కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కొత్తవలస: మండలంలోని శారద కంపెనీ బొగ్గు యాడ్‌లో గుర్తు తెలియని మృతదేహం ఆదివారం లభ్యమైంది. సదురు బొగ్గు అంతా లారీల్లో ఒరిస్సా నుంచి వచ్చినట్లు శారదా కంపెనీ డిఎంజి హెచ్ సన్యాసిరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృత దేహం కూడా అక్కడి నుంచే వచ్చినట్లు అనుమానం వ్యక్తం చేశారు. సిఐ సిహెచ్ షణ్ముఖ రావు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాజీమంత్రి పడాల కుమారుడు మృతి

గజపతినగరం: మాజీ మంత్రి పడాల అరుణ ఇంట్లో విషాదం నెలకొంది. ఆమె ఒక్కగానొక కొడుకు శరత్ చంద్ర(42)ఆదివారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందాడు. అనారోగ్యం కారణంతో ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో మాజీ మంత్రి పడాల అరుణ గుండెలవిసేలా రోదిస్తున్నారు. శరత్ చంద్రకు భార్య, కుమార్తె ఉన్నారు. పడాల అరుణ టిడిపి హయాంలో మంత్రిగా పనిచేయగా, ప్రస్తుతం జనసేన పార్టీలో కొనసాగుతున్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశ ప్రకటన

రేఖా నెం.28674/NE/2024, dated: 13-09-2024 ప్రకారం 2024 2025 విద్యా సంవత్సరమునకు ఈ దిగువ తెలిపిన ప్రైవేటు నర్సింగ్ స్కూల్స్ నందు 3 Years జనరల్ నర్సింగ్ మరియు మిడ్ వైఫరి - స్టాఫ్ నర్స్ ట్రైనింగ్ కోర్స్ (including 6 Months Internship) మొదటి సంవత్సరము నందు ప్రవేశము కొరకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తు కోరబడుతున్నవి. దరఖాస్తు కొరకు http://dme.ap.nic.in online ద్వారా కన్వీనర్ మరియు మేనేజెమెంట్ కోటా సీట్లు కొరకు online ద్వారా తేది 13-09-2024 నుండి 25-09-2024 లోపల దరఖాస్తు పూర్తి చేయవలెను. కన్వీనర్ కోటా సీట్ల కొరకు పూర్తి చేసిన దరఖాస్తులను తేది 25-09-2024 లోపల సమర్పించవలెను. మరియు మేనజేమెంటు కోటా సీట్ల కొరకు దరఖాస్తులను తేది 28-09-2024 లోపల సమర్పించవలెను.

నెం	శిక్షణా సంస్థ పేరు మరియు ప్రదేశము	మొత్తం సీట్లు	కన్వీనర్ సీట్లు	యాజమాన్య సీట్లు	టూషన్ ఫీజు సంవత్సరమునకు ఉచిత సీట్లకు	మేనేజ్‌మెంటు సీట్లుకు సీట్లకు ఫీజు సంవత్సరమునకు
1	లక్ష్మి స్కూల్ అఫ్ నర్సింగ్, ఆర్. టి.వో. ఆఫీస్ దరి, శ్రీ రంగా మోటార్స్ ఎదురుగా, కే.యల్. పురం, విజయనగరం.	60	36	24	గవర్నమెంట్ సీట్లకు 14,000/- సంవత్సరమునకు	కన్వీనర్ సీటు పై 5 రెట్లు మించకుండా
2	తిరుమల స్కూల్ అఫ్ నర్సింగ్, తిరుమల హాస్పిటల్ నియర్, APSRTC Complex, విజయనగరం.	45	27	18	గవర్నమెంట్ సీట్లకు 14,000/- సంవత్సరమునకు	కన్వీనర్ సీటు పై 5 రెట్లు మించకుండా
3	వెంకట పద్మ స్కూల్ అఫ్ నర్సింగ్, ప్రదీప్ నగర్, జిల్లా కోర్టు దగ్గర, విజయనగరం.	60	36	24	గవర్నమెంట్ సీట్లకు 14,000/- సంవత్సరమునకు	కన్వీనర్ సీటు పై 5 రెట్లు మించకుండా
4	జీసస్ మెరియన్ స్కూల్ అఫ్ నర్సింగ్, కొత్తవలస, విజయనగరం జిల్లా.	60	36	24	గవర్నమెంట్ సీట్లకు 14,000/- సంవత్సరమునకు	కన్వీనర్ సీటు పై 5 రెట్లు మించకుండా
5	సాయి లక్ష్మి స్కూల్ అఫ్ నర్సింగ్, Opp:APSRTC Complex, గజపతినగరం, విజయనగరం జిల్లా.	40	24	16	గవర్నమెంట్ సీట్లకు 14,000/- సంవత్సరమునకు	కన్వీనర్ సీటు పై 5 రెట్లు మించకుండా
6	లక్ష్మి సూర్య స్కూల్ అఫ్ నర్సింగ్, YKM 7 Colony, పార్వతిపురం, విజయనగరం జిల్లా	40	24	16	గవర్నమెంట్ సీట్లకు 14,000/- సంవత్సరమునకు	కన్వీనర్ సీటు పై 5 రెట్లు మించకుండా
7	కౌముది స్కూల్ ఆఫ్ నర్సింగ్ కొత్తవలస, విజయనగరము	60	36	24	గవర్నమెంట్ సీట్లకు 14,000/- సంవత్సరమునకు	కన్వీనర్ సీటు పై 5 రెట్లు మించకుండా

అర్హత: - అభ్యర్థులు ఇంటర్మీడియట్ పాస్ మరియు తప్పనిసరిగా ఇంగ్లీష్ సబ్జెక్టు నందు 40% మార్కులు వచ్చి ఉండవలెను. లేదా యం.పి. హెచ్. డబ్ల్యు. (ఫిమేల్) వొకేషనల్ లేదా మరియు ఇంటర్మీడియట్ నకు తత్సమాన గ్రూపు వారు ఎవరైనా అర్హులు.
ఏ.ఎన్.యం. కోర్స్ పాస్ అయిన అభ్యర్థులకు ఇంగ్లీష్ సబ్జెక్టు మార్క్స్ అవసరం లేదు.

ప్రాధాన్యత:- సైన్సు గ్రూపుల వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. తదుపరి మిగిలిన గ్రూపులు వారిని పరిగణలోకి తీసుకోనబడును.

వయస్సు:- తే: 31.12.2024 తేది నాటికి 17 సంవత్సరములు నిండి ఏ.ఎన్.యం. యల్. హెచ్.వి. అభ్యర్థులకు వయస్సు నిభందన లేదు.

ఫీజు:- 500/- రూపాయలు గవర్నమెంట్ చాలాన ద్వారా ఈ క్రింద తెలుపబడిన హెడ్ అఫ్ ఎకౌంటు కు జమచేసి, దానిని అప్లికేషన్ కు జతచేయవలెను.

హెడ్ ఆఫ్ ఎకౌంటు (HOA: 0210-Medical & Public Health
03-Medical Education Training and Research
MH-105- Allopathy
SH-81- Other Receipts
001- Other Receipts)

గమనిక:- ఇతర రాష్ట్రముల నుండి దరఖాస్తు చేయు అభ్యర్థులు తప్పనిసరిగా మైగ్రేషన్ సర్టిఫికేట్ జతపర్చవలెను.

మెరిట్ నిర్ధారణ:- లాంగ్వేజ్ కాకుండా గ్రూపు సబ్జెక్టులతో 40% మెరిట్ వచ్చి యుండవలెను. మొదటి సారి పాస్ అయిన వారి తరువాత కంపార్ట్మెంట్ లో పాస్ అయిన వారికి హెచ్చు మార్కుల ప్రాతిపదికన ప్రాధాన్యత తీసుకోనబడును. షెడ్యూలు కులములు షెడ్యూలు తెగలు మరియు వెనుకబడిన తరగతుల వారికి 5% సడలింపు కలదు.

రిజర్వేషన్:- 85% సీట్లు లోకల్ అభ్యర్థులకు కేటాయించబడును. లోకల్ అభ్యర్థులు లేనిచో ఇతరులకు కేటాయించబడును.

పూర్తి చేసిన దరఖాస్తులను కన్వినర్ సీట్ల కొరకు తేది 25-09-2024 లోపల సమర్పించవలెను. మరియు మేనేజ్మెంట్ కోటా సీట్ల కొరకు దరఖాస్తులను తేది 28-09-2024 లోపల సమర్పించవలెను లోపల ధ్రువీకరించిన సర్టిఫికేట్‌లు జెరాక్స్ కాపీలు జత చేసి విజయనగరం జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాకాధికారి వారి కార్యాలయం పని వేళలలో సమర్పించవలెను. తపాలా వారి ఆలస్యము నకు ఈ కార్యాలయము ఎట్టి భాధ్యత వహించదు.

**జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాకాధికారి,
విజయనగరము**

పలు చోట్ల 'ఇది మంచి ప్రభుత్వం'

ప్రజాశక్తి- గుర్ల, రామభద్రపురం, డెంకాడ, కొత్తవలస

జిల్లాలోని డెంకాడ, కొత్తవలస, రామభద్రపురం, గుర్ల మండలాల్లో ఆదివారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. డెంకాడ, కొత్తవలస, రామభద్రపురంలో ఎమ్మెల్యేలు లోకం మాధవి, కోళ్ల లలితకుమారి, బేబినాయన పాల్గొని 100 రోజుల్లో ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు వివరించారు. గుర్ల మండలంలో జరిగిన కార్యక్రమంలో బిసి సెల్ కార్యదర్శి దాసరి శివప్రసాద్ పాల్గొని వివరించారు.



డెంకాడ: కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, టిడిపి నాయకులు

కొత్తవలస: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

రామభద్రపురం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే బేబినాయన

గుర్ల: కరపత్రాలను పంపిణీ చేస్తున్న దాసరి శివప్రసాద్